క్లుప్తంగా

ఆదిత్యునికి అభిషేకాలు


సుజాతనగర్‌లో పూజలందుకు సూర్యనారాయణుడు

పెందుర్తి: సుజాతనగర్‌లోని సూర్యనారాయణస్వామి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. వేకువజామున స్వామివారికి పంచ ద్రవ్యాలతో విశేష అభిషేకాలు చేశారు. అలంకరణ చేసి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో ఆదిత్యునికి పంచ హారతి, నక్షత్ర హారతి ఇచ్చారు. ఆలయ ధర్మకర్త చంద్రశేఖర్‌రెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు


కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ అసిరితాత

పెందుర్తి: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే జైలు పాలు కావాల్సి వస్తుందని సబ్ ఇన్‌స్పెక్టర్ అసిరితాత రౌడీ షీటర్లను హెచ్చరించారు. సత్ప్రవర్తనతో ఉంటే రౌడీ షీట్‌లు తొలగించేందుకు ఉన్నతాధికారులు సిఫార్సు చేస్తారని తెలిపారు. పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు సీఐ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ చెడు ప్రవర్తన వలన తమ కుటుంబాలు సమాజంలో నిరాదరణకు గురవుతాయని, ఆ పరిస్థితి కుటుంబ సభ్యులకు తీసుకురావొద్దని హితవు పలికారు. రౌడీషీటర్ల ప్రవర్తన పిల్లల భవిష్యత్‌పై కూడా ప్రభావం చూపుతుందన్నారు. పలు సూచనలు చేశారు. సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ మండల కార్యదర్శిగా గోవిందరాజు


గోవిందరాజు


పరవాడ: బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా తాడి గ్రామానికి చెందిన బంతి కోరు గోవిందరాజు ఎంపికయ్యారు. బీజేపీ మండల కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో మండల కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని గోవిందరాజు అన్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పట్టాభి ప్రసాద్, ఉపాధ్యక్షుడు ముత్యాల అప్పారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గండి నమో, మండల అధ్యక్షుడు పిల్లా సతీష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

బీసీ సంఘం యూత్ జనరల్ సెక్రటరీగా నాగేశ్వరరావు


ఉత్తర్వులు అందుకుంటున్న నాగేశ్వరరావు

పరవాడ: జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యూత్ జనరల్ సెక్రటరీగా ముత్యాలమ్మపాలెం గ్రామానికి చెందిన చింతకాయల కొర్లయ్యను ఎంపిక చేస్తూ సంఘ అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు ఉత్తర్వులు జారీ చేశారు. అనకాపల్లిలో ఆదివారం జరిగిన సమావేశంలో కొర్లయ్యకు నియామక ఉత్తర్వులు అందించారు. ఈ సందర్భంగా కొర్లయ్య మాట్లాడుతూ అసోసియేషన్ పటిష్టతకు తన వంతు కృషి చేస్తానన్నారు.

పద్మనాభనగర్‌లో పోలీసుల విస్తృత తనిఖీలు


పద్మనాభనగర్ ప్రాంతంలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

పెందుర్తి: వేపగుంట సమీపంలోని పద్మనాభనగర్‌లో అసంపూర్తిగా ఉన్న టిడ్కో హౌసింగ్ ప్రాంతంలో పెందుర్తి పోలీసులు ఆదివారం విస్తృతంగా తనిఖీ చేశారు. బహిరంగ మద్యపానం, పేకాట, గంజాయి సేవనం తదితర అసాంఘిక కార్యకలాపాలు జరుతున్నాయని స్టేషన్‌కు ఫిర్యాదులు వచ్చాయి. ఈ క్రమంలో సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు పోలీసులు తనిఖీలు నిర్వహించారు. స్థానికులను విచారించారు. అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిరంతరం నిఘా ఉంచుతామని ఎస్‌ఐ అసిరితాత తెలిపారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

సబ్బవరం: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం మజ్జిగ పంపిణీ చేశారు. స్థానిక సీఐ పిన్నింటి రమణ మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు వాసవి క్లబ్ మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. క్లబ్ చైర్మన్ దంగేటి సంతోష్ గుప్తా, కార్యదర్శి దంగేటి సన్యాసిరావు, కోశాధికారి ఎస్.సతీష్‌తో పాటు పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అప్పన్న తిరువీధి సంబరం అడవివరం ప్రజల వైభోగం


వరాహ పుష్కరిణి వద్ద స్వామి ఊరేగింపులో అడవివరం గ్రామస్తులు


గజవాహనంపై తిరువీధిలో అప్పన్న

ఏడాదిలో 361 రోజులు సింహగిరిపైనే కొలువుదీరి పూజలు అందుకునే శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నాలుగు రోజులు మాత్రం కొండదిగువ అడవివరం గ్రామానికి వేంచేస్తాడు. అది అడవివరం గ్రామస్తులు చేసుకున్న పూర్వజన్మ సుకృతం. వాతావరణం ప్రతికూలంగా ఉంటే తప్ప.. ఆ నాలుగు రోజుల్లో నేరుగా స్వామివారే కొండదిగి అడవివరానికి పండగ శోభ తీసుకొస్తాడు. ఆయా రోజుల్లో గ్రామస్తులు తమ ఇళ్లను ముస్తాబు చేసి, కుటుంబ సభ్యులంతా ఇళ్ల ముంగిట నిలిచి స్వామివారిని దర్శించుకుని, హారతులిచ్చి, సేవిస్తారు.

- ఏటా నాలుగుసార్లు కొండదిగువ కనువిందు చేస్తున్న అప్పన్న
- ఆధ్యాత్మిక పరవశంలో అడవివరం గ్రామస్తులు
- తమ ఇళ్ల ముందుకు వచ్చే స్వామికి విశేష హారతులు


తిరువీధిలో స్వామిని దర్శించుకుంటున్న అడవివరం ప్రజలు

అప్పన్న కొండ దిగే రోజులు

- **డోలోత్సవం:** ఉద్యానమండపంలో ఫాల్గుణ పౌర్ణమి రోజున
- **తెప్పోత్సవం:** పుష్య బహుళ అమావాస్య నాడు వరాహ పుష్కరిణిలో
- **జమ్మివేట:** విజయదశమి రోజున స్వామివారి పూలతోటలో
- **మకరవేట:** స్వామివారి పూలతోటలోనే కనుమ రోజు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకోవాలంటే ఎవరైనా సింహగిరికి వెళ్లాల్సిందే. ఆయన దర్శనానికి దేశం నలుమూలల నుంచే కాకుండా విదేశీయులు కూడా సింహగిరికి చేరుకోవాల్సిందే. తీరా వెళ్లాక సమయాభావం వల్ల దర్శనం కాకపోతే మళ్లీ దర్శన వేళలు వరకూ వేచి ఉండాల్సిందే. అలాంటిది అడవివరం గ్రామస్తులకు మాత్రం స్వామి వారి ఇళ్ల వద్దకే వేంచేస్తాడు. స్వామి అనుగ్రహం తమపై నిత్యం ఉంటుందనడానికి ఏడాదిలో నాలుగుసార్లు ఆయన కొండదిగి తమ గ్రామానికి రావడమే నిదర్శనమని గ్రామస్తులు మహదానందంగా చెప్పుకుంటారు.

ఆ మూడు వీధుల్లో..

కొండదిగువ నాలుగు పర్వదినాల్లో జరిగే ఉత్సవాల అనంతరం స్వామిని పుష్కరిణి సత్రం వద్ద ఉన్న ఉద్యానవన మండపం వద్ద ఉంచి, అక్కడి నుంచే తిరువీధి ఉత్సవాలు ప్రారంభిస్తారు. డోలోత్సవం రోజున పల్లకీలోను, తెప్పోత్సవం సర్వజన మనోరంజనిపైన, మకరవేట గజవాహనంపై, జమ్మివేట ఉత్సవాన అశ్వవాహనంపైన స్వామికి తిరువీధి నిర్వహిస్తారు. గ్రామంలోని పోస్టాఫీసు వీధి, మధ్యవీధి, రాజవీధుల మీదుగా సాగే ఈ ఊరేగింపులో నివాసితులంతా ఇళ్ల నుంచి ముంగిట నిలిచి, స్వామివారి రాకకోసం వేయికళ్లతో ఎదురుచూస్తారు. తమ ఇళ్ల ముందుకు వేంచేసే స్వామికి హారతులిచ్చి, కొబ్బరి, అరటి తదితర పండ్లతో నైవేద్యం సమర్పించి, సాగనంపుతారు. ముఖ్యంగా దేవస్థానంలో విధులు నిర్వర్తించే వైదికులు ఈ మూడు వీధుల్లోనే ఎక్కువగా ఉండటం కూడా తిరువీధి ఉత్సవాలకు మరింత శోభ చేకూరుతోంది.

వర్షాలు పడితే నిరాశే..

కొండ దిగువ ఉత్సవాలు జరిగే రోజుల్లో వర్షాలు పడితే మాత్రం స్వామిని కిందికి తీసుకురారు. మెట్ల మార్గంలో స్వామిని కిందికి దించడం కష్టం కావడంతో ఆ ఉత్సవాలను సింహగిరిపైనే వైదికులు నిర్వహిస్తారు. అలాంటి సమయాల్లో తెప్పోత్సవాన్ని ఆలయ ప్రాంగణంలో ఉన్న కొలనులో, జమ్మివేట, మకరవేట ఉత్సవాలను కల్యాణమండపంలో నిర్వహిస్తారు. తిరువీధులను కూడా ఆలయ బేడా మండపంలోనే జరిపేస్తారు. ఆయా రోజుల్లో స్వామి రాకకోసం ఎదురుచూసే అడవివరం గ్రామస్తులు నిరాశ చెందుతారు. కానీ వారి ఆశ ఒక ఉత్సవంలో కాకపోయినా మరొక ఉత్సవంలోనైనా నెరవేరుతుంది. అందుకే ఆ స్వామి తమ సొత్తు అని పలువురు గ్రామస్తులు అభివర్ణిస్తుంటారు.

స్వామిరాకతో నూతనోత్తేజం

ఏటా నాలుగుసార్లు వరాహ లక్ష్మీనృసింహస్వామి సింహగిరి నుంచి మెట్లమార్గంలో కొండ దిగి అడవివరం గ్రామానికి చేరుకుంటాడు. ఆయన రాకకోసం గ్రామస్తులు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తారు. చాలా మంది గ్రామస్తులు వేరే గ్రామాల్లో ఉన్న తమ బంధువులకు ఆ రోజుల్లో ఉత్సవాల సమాచారం అందించి, తమ ఇళ్లకు ఆహ్వానిస్తారు. కొండదిగువ తొలిపావంచా వద్దకు చేరుకున్న స్వామికి స్వాగతం పలకడం నుంచి ఉత్సవాలు జరిగే పూలతోట, వరాహపుష్కరిణి, ఉద్యానవన మండపంల వద్దకు పెద్ద ఎత్తున కుటుంబాలతో చేరుకుంటారు. స్వామికి జేజేలు పలుకుతూ ఆహ్వానిస్తారు. తమకు మాత్రమే కల్గిన అదృష్టాన్ని కళ్లారా ఆస్వాదిస్తూ, నూతనోత్తేజంతో ఇళ్లకు తిరుగుముఖం పడతారు.


స్వామి రాకకోసం పండ్లు, హారతులతో గ్రామస్తులు

గ్రామస్తులు చేసుకున్న పుణ్యం



శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వేంచేసిన సింహగిరికి ఎంత విశిష్టత ఉందో, కొండదిగువ ఉన్న అడవివరం గ్రామానికి కూడా అంత విశిష్టత ఉంది. అందుకే ఆ స్వామి దివి నుంచి భువికి దిగివచ్చినట్లు.. అడవివరం గ్రామస్తులకు ఆశీస్సులు అందించేందుకు సింహగిరి నుంచి కొండ దిగువకి వస్తాడని అంతా భావిస్తాం. నిజంగా మా అడవివరం గ్రామస్తులు చేసుకున్న పుణ్యం ఇది.

– చిట్టిళ్ల శేషగిరిరావు, రాజవీధి, అడవివరం

అంతా పూర్వ జన్మ సుకృతం



సాక్షాత్తూ ఆ మహావిష్ణువు అవతారమైన వరాహ లక్ష్మీనృసింహస్వామి ఏటా నాలుగుసార్లు కొండ దిగి రావడం అడవివరం నివాసితుల పూర్వజన్మ సుకృతం. కొండదిగువ వరాహపుష్కరిణిలో పుష్యబహుళ అమావాస్యనాడు జరిగే తెప్పోత్సవం కారణంగా ఆ నీరు పుణ్యతీర్థంగా మారుతుందని చెప్తారు. కాశీ వెళ్లలేని వారు వరాహ పుష్కరిణిలో స్నానం చేస్తే సరిపోతుందని పెద్దలంటారు.

– ఇరుకు సోమేశ్వరశర్మ, అడవివరం

ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలో పోరాటం

- పార్టీ కోసం కష్టపడే ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం
- అనుబంధ కమిటీల ఏర్పాటులో సమన్యాయం
- సబ్బవరం ముఖ్య నాయకులతో నియోజకవర్గ సమన్వయకర్త అదీప్‌రాజ్



సబ్బవరం మండల ముఖ్య నాయకులతో అదీప్‌రాజ్

పెందుర్తి: కూటమి ప్రభుత్వ వైఫల్యాలు, మోసాలను ఎండగడుతూ క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలపై పోరాటాలు చేయడానికి సిద్ధం కావాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పిలుపునిచ్చారు. పెందుర్తి మండలం రాంపురంలోని క్యాంప్ కార్యాలయంలో సబ్బవరం మండల వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదీప్‌రాజ్ మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం లభిస్తుందన్నారు. ఇప్పటికే జిల్లా అనుబంధ కమిటీల్లో పలువురికి తగిన గౌరవం దక్కిందన్నారు. రానున్న అనుబంధ కమిటీల్లో మిగిలిన వారికి కూడా తగిన స్థానాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని, వారికి ఏ కష్టం వచ్చినా నాయకులు అండగా నిలవాలని చెప్పారు. సమావేశంలో పార్టీ సీనియర్ నేత బోకం రామునాయుడు, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, జిల్లా బీసీ విభాగం మాజీ అధ్యక్షుడు కొటాన రాము, జిల్లా యువజన విభాగం మాజీ అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్‌రాజ్, బీసీ విభాగం అధ్యక్షుడు రాపేటి రాము, రైతు విభాగం అధ్యక్షుడు, సర్పంచ్ వడ్డాది అప్పలరాజు, నాయకులు వనం అచ్చంనాయుడు, బోని నాయుడు, రాజేష్, ఎర్ర శ్రీనివాస్, ఎం.పి.రాజు, రామచంద్రరావు, రాజు, సబ్బవరపు నాగభూషణం, కోట్ని నాయుడు, కర్రి శ్రీను, దినిమిరెడ్డి శ్రీను, శ్రీను, కొటాన వెంకటరమణ, నూకరాజు, వెంకట్రావు, దుర్గారావు, అప్పారావు, నాగేష్, రామకృష్ణ, జానకిరామ్, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు


స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కొలువుంచారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. 108 స్వర్ణసంపెంగలతో అష్టోత్తరశతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.


నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా నిత్యకల్యాణం

వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

‘ఉపాధి’ బకాయిలు చెల్లించాలని డిమాండ్


గండివానిపాలెం చెరువులో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న గనిశెట్టి

పరవాడ: ఉపాధికూలీలకు చెల్లించాల్సిన బకాయిలు తక్షణమే చెల్లించాలని సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. పెదముషిడివాడ శివారు గండివానిపాలెంలో ఉపాధి కూలీలతో ఆదివారం ఆయన మాట్లాడారు. ఏడు వారాలుగా కూలి డబ్బులు చెల్లించకపోవడంతో కూలీల కుటుంబాలు పస్తులుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పనిచేసిన కూలీలకు పే స్లిప్పులు అందజేయాలన్నారు. ప్రభుత్వం కూలి డబ్బులు చెల్లించడంలో తాత్సారం చేయడంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మూడేళ్లుగా బడ్జెట్‌లో కోత విధించి మెటీరియల్ చార్జీలు పెంచేశారని తెలిపారు. ముందుగా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించి ఆ తర్వాత కూలీలకు చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. గతంలో 20 శాతం సమ్మర్ అలవెన్స్ ఇచ్చేవారని, ఇప్పుడు పూర్తిగా కోత విధించారని వెల్లడించారు. ఈ ఏడాది సమ్మర్ అలవెన్స్ 30 శాతం చెల్లించాలని, మెడికల్ కిట్లు, తట్టా, పార, గునపాం, టెంట్లు, మంచినీటికి డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతి కుటుంబానికి 200 రోజుల పనిదినాలు కేటాయించి రోజుకి రూ.600 కూలి చెల్లించాలన్నారు. ట్రావెలింగ్ అలవెన్స్‌ను కూడా చెల్లించాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధి కూలీలు జి.అప్పారావు, ఎన్.నాగలక్ష్మి, పి.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

రేపు గ్రామ దేవతల పండగ


వెంకటపతిపాలెంలోని ముత్యమాంబ


భర్నికంలో వెలసిన పరదేశిమాంబ

పరవాడ: వాడచీపురుపల్లి, నాయుడుపాలెం, భర్నికం గ్రామాల ప్రజలు కొలిచే గ్రామదేవతలు ముత్యమాంబ, పరదేశిమాంబ అమ్మవార్ల పండగలను ఈ నెల 18న ఘనంగా నిర్వహించేందుకు ఆయా గ్రామస్తులు ఏర్పాట్లు చేశారు. ఆలయాలను, పురవీధుల్ని రంగురంగుల విద్యుత్ తోరణాలతో అలంకరించారు. మంగళవారం వేకువ జాము నుంచి గ్రామ దేవతలను భక్తులు దర్శించుకోవడానికి వీలుగా ఆలయాల వద్ద బారికేడ్లు, షామియానాలను ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసింది. భక్తులకు ఉచిత ప్రసాదం, మజ్జిగ, మంచినీటి పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు. అదే రోజు రాత్రి అమ్మవార్లను డప్పు వాయిద్యాలు, చిడతలు, నేల డ్యాన్సులతో పురవీధుల్లో ఊరేగించి భారీ బాణ సంచా వెలుగుల మధ్య అనుపోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. ఆ రోజు రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించనున్నట్లు ఆయా గ్రామాల ఉత్సవ కమిటీ ప్రతినిధులు వెల్లడించారు.

పుట్టిన రోజున ఓ మొక్క నాటండి



సే నో టు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ప్లకార్డులతో నినాదాలు చేస్తున్న హాస్టల్ విద్యార్థులు

- గ్రీన్ క్లైమేట్ టీం వ్యవస్థాపకుడు జె.వి.రత్నం

పెందుర్తి: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని గ్రీన్ క్లైమేట్ టీం(ఎన్‌జీవో) వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం అన్నారు. ప్రతి ఒక్కరూ తమ పుట్టినరోజున ఓ మొక్కను నాటాలని పిలుపునిచ్చారు. స్థానిక ఎస్సీ బాలికల వసతి గృహంలో ఆదివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎకో వైజాగ్‌ను జయప్రదం చేసే దిశగా అందరూ భాగస్వాములు కావాలని కోరారు. వేసవిలో మనం తినే దేశీయ పండ్ల గింజలను ఆరబెట్టి.. వేసవి తరువాత వాటిని కొండలు, తీర ప్రాంతాలు, మొక్కలు పెరగడానికి అనువుగా ఉండే ఇతర ప్రాంతాల్లో చల్లి, సామాజిక వనాలు పెరిగేందుకు దోహదపడాలని పిలుపునిచ్చారు. పశుపక్ష్యాదులకు వేసవిలో నీటిని అందుబాటులో ఉంచడాన్ని సామాజిక బాధ్యతగా తీసుకోవాలన్నారు. విద్యార్థులు పచ్చదనాన్ని పెంపొందించే దిశగా చొరవ తీసుకోవాలని సూచించారు. మానవ జీవనం నుంచి ప్లాస్టిక్‌ను పూర్తిగా దూరం చేయాలని కోరారు. విద్యార్థులతో కలిసి ‘సే నో యూజ్ ప్లాస్టిక్’ఆంగ్ల అక్షరాలను ప్లకార్డులుగా చేతపట్టి, నినాదాలు చేశారు. వార్డెన్ అతవ సత్యవతి, గ్రీన్ వలంటీర్లు జె.రాజేశ్వరి, ఐ.కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న రత్నం, సత్యవతి, విద్యార్థులు

కూటమిలో టీడీపీ నాయకులకు న్యాయం జరగట్లేదు

- పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవంలో నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జి
- బండారు వర్గానికి అందని ఆహ్వానం


కార్యాలయం ప్రారంభోత్సవంలో పాల్గొన్న గండి బాబ్జి, పార్టీ స్థానిక నాయకులు

పెందుర్తి: ‘కూటమి ప్రభుత్వం కావడం వలన నియోజకవర్గంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలకు తగిన న్యాయం జరగడం లేదు, చాలాచోట్ల వారు ఇబ్బందులు పడుతున్నట్లు మా దృష్టికి వస్తున్నాయి. కానీ సమస్యలున్నా ప్రస్తుతానికి సమన్వయంతో ముందుకు వెళ్లడమే ఉత్తమం. త్వరలో విడుదల కానున్న నామినేటెడ్, వచ్చే ఏడాది జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ కేడర్‌కు తగిన ప్రాధాన్యత ఉండేలా చూస్తా’నంటూ మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జి అన్నారు. రాంపురం సమీపంలోని సాధుమఠం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన పార్టీ నియోజకవర్గ కేంద్ర కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చాలా చోట్ల టీడీపీ కేడర్‌కు తగిన ప్రాధాన్యత ఉండడం లేదన్నారు. రానున్న రోజుల్లో దాన్ని అధిగమించే దిశగా చర్యలుంటాయని చెప్పారు. ఆ పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షుడు భరణికాన సాయినాథరావు, పార్టీ నేత సీతంరాజు సుధాకర్, కార్పొరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

బండారు వర్గానికి నో ఎంట్రీ

టీడీపీ కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా నియోజకవర్గంలోని ఆ పార్టీ శ్రేణుల్లో విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. కార్యక్రమానికి స్థానికుడైన బండారు సత్యనారాయణమూర్తి(మాడుగుల ఎమ్మెల్యే) వర్గానికి ఆహ్వానం అందలేదు. దీంతో నియోజకవర్గంలోని బండారు వర్గీయులంతా కార్యక్రమానికి దూరంగా ఉన్నారు. అంతే కాకుండా గండి బాబ్జి, అతని వర్గీయుల తీరుపై అనకాపల్లి జిల్లా పార్టీ అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబుకు పెందుర్తి మండల టీడీపీ అధ్యక్షుడు కరక దేముడు, సర్పంచ్ మడక అప్పలరాజు, జెర్రిపోతులపాలెం, చింతగట్ల ప్రాంతానికి చెందిన పలువురు సీనియర్ టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు.

నూకాలమ్మ ఆలయంలో చోరీ

- ఆరు తులాల వెండి, నగదు అపహరణ

పెందుర్తి: మండలంలోని గుర్రంపాలెం పంచాయతీ అక్కిరెడ్డిపాలెం నూకాలమ్మ ఆలయంలో చోరీ జరిగింది. ఆరు తులాల వెండి ఆభరణాలతో పాటు హుండీలోని రూ.40–50 వేల వరకు నగదు అపహరణకు గురైనట్లు సర్పంచ్ ఉగ్గిన గోవిందరాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలివి.. ఆలయాన్ని తెరిచేందుకు ఆదివారం తెల్లవారుజామున పూజారి భూషి రమణమ్మ వచ్చింది. అప్పటికే తలుపులు తెరిచి ఉండడంతో అనుమానం వచ్చి లోపల చూడగా హుండీ, అమ్మవారికి వేసిన వెండి ఆభరణాలు కనిపించలేదు. వెంటనే సర్పంచ్‌కు, గ్రామపెద్దలు గండ్రెడ్డి నగేష్, అక్కిరెడ్డి చినరమణకు సమాచారం ఇచ్చింది. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడి పందాలాడుతున్న ఐదుగురి అరెస్ట్

పరవాడ: మండలంలోని గొల్లలపాలెం శివారు ప్రాంతంలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న కోడి పందెం శిబిరంపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. పందాలు ఆడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసి రెండు కోళ్లు, రూ.9,830 నగదు స్వాధీనం చేసుకున్నారు. సీఐ ధనుంజయరావు ఆదేశాల మేరకు నిర్వహించిన దాడిలో ఎస్‌ఐ కృష్ణారావు, పీసీలు లక్ష్మణరావు, మురళి, నాగరాజు పాల్గొన్నారు.